కళారంగ.. 'ప్రోత్సాహ వేదిక'

కాకినాడ కల్చరల్: భారతదేశ సంస్కృతికి పట్టుకొమ్మలైన కళలకు పూర్వవైభవం చేకూర్చాలనే ఉన్నత ఆశయంతో దాడి చంద్రశేఖర్ 'సాహిత్య, సాంస్కృతిక, భాష, కళారంగాల ప్రోత్సాహ వేదికను 2016లో మాతృభాషా దినోత్సవం రోజున ప్రారంభించారు. అధ్యక్షుడిగా దాడి చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శిగా డి.పద్మావతి, సమన్వయకర్తలుగా మేడిశెట్టి శ్రీరాములు, ఆర్.నీలకంఠశర్మ, ఎంవీ రామలక్ష్మి, ఎం.లిల్లీనిర్మల తదితరుల కమిటీ ఈ వేదికను ఏర్పాటు చేశారు.

- యూటీఎఫ్ భవనంలో 20 మంది ఉత్తమ ప్రతిభావంతులకు పురస్కారాలు అందజేశారు.



ఉత్తమ మహిళలకు ప్రపంచ మహిళా దినోత్సవంలో సత్కరిస్తున్న వేదిక సభ్యులు



పేదమహిళలకు చీరలు అందజేస్తున్న వేదిక అధ్యక్షుడు దాడి చంద్రశేఖర్ తదితరులు

- 2018లో వివిధ కళారంగాల్లో విశిష్ట సేవలు అందజేసిన కళాకారులకు ఉగాది పురస్కారాలు ప్రదానం చేసి ప్రోత్సహించారు.
- 2019లో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఉత్తమ మహిళామణులను సత్కరించి పురస్కారాలు ప్రదానం చేశారు.
- 2021లో చిన్నారులకు కవితలు, శతకాల పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు.
- 2020 స్థానిక గాంధీభవన్‌లో తెలుగు, హిందీ భాషా దినోత్సవాలను నిర్వహించి భాషావేత్తలకు పురస్కారాలు ప్రదానం చేశారు.
- 2022లో పరమార్థం పుస్తక రచయిత కర్రి రాజ భౌమహరినారాయణ చక్రవర్తి(ఐఏఎస్ అధికారి)ని సత్కరించారు. అలాగే 20 మంది తెలుగు ఉపాధ్యాయులను సత్కరించారు.
- హిందీ భాషా దినోత్సవం(సెప్టెంబర్ 14) పురస్కరించుకొని వేడుకలు నిర్వహిస్తున్నారు. 20 మంది హిందీ ఉపాధ్యాయులను సత్కరించనున్నారు.
- ఇతిహాసాల్లోని నైతిక విలువలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు రామయాణం, మహాభారతంపై ప్రసంగ కార్యక్రమాలు నిర్వహిస్తోంది.

ఔత్సాహిక కళాకారులకు చేయూత

పేదలకు, పేద కళాకారులకు ఆర్థిక సాయం అందజేయడమే కాదు.. సమాజంలో నైతిక విలువలు పెంపొందించేందుకు సాహిత్య రచనలు, కళాప్రదర్శనలను ఈ వేదిక నిర్వహిస్తోంది. విద్యా సదస్సుల ద్వారా విద్యార్థుల్లో నైపుణ్యాలను వెలికితీసి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేలా ప్రోత్సహిస్తోంది. సాహిత్య, సాంస్కృతిక కళారంగాల్లో ఉత్తమ పురస్కారాలు ప్రదానం చేసి ఔత్సాహిక కళాకారులకు అండగా నిలుస్తోంది. సాహిత్య ప్రసంగాలు, అవధానాలు నిర్వహించి భాషాభిమానులను చైతన్యపరచడం, పుస్తకావిష్కరణలు, పుస్తక సమీక్షలు నిర్వహించడం వంటి కార్యకలాపాలు చేపడుతోంది. అలా అందరికీ ప్రోత్సాహాన్నిస్తూ.. ఓ వేదిక అవుతోంది.

మరింత మందిని ప్రోత్సహించేందుకు..



ప్రోత్సాహం మనిషికి ఎంతో ఆత్మవిశ్వాసాన్ని పెంచుతోంది. అటువంటి ప్రోత్సాహాన్ని ఔత్సాహిక కళాకారులకు అందజేసి వారిలో ఆత్మస్థైర్యాన్ని నింపేందుకు వేదిక ఏర్పాటు చేశాం. సమాజం నాకేం ఇచ్చిందని కాకుండా మనం సమాజానికి ఏమీ చేశామనే ఆత్మవిమర్శ చేసుకొంటూ సేవలు అందజేస్తున్నాం. ఆరేళ్ల నుంచి ఆయా రంగాల్లో రాణిస్తున్న సేవలకు సత్కరిస్తున్నాం.

– దాడి చంద్రశేఖర్, ప్రోత్సాహ వేదిక, వ్యవస్థాపక అధ్యక్షుడు

యువతకు భాగస్వామ్యం



సాహిత్యం, కళలలో యువత పాత్ర చాలా కీలకం. యువతలో కళలపై స్ఫూర్తిని నింపి, కళలకు పూర్వవైభం తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నాం. పేద విద్యార్థుల్లో ఉన్న నైపుణ్యాలను వెలికి తీసేందుకు వేదిక కృషి చేస్తోంది. భాషా, సంస్కృతిపై విద్యాలయాల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం. పద్య పోటీలు నిర్వహించి ప్రోత్సాహకంగా బహుమతులు ప్రదానం చేస్తున్నాం.

– డి.పద్మావతి, ప్రధాన కార్యదర్శి, ప్రోత్సాహ వేదిక

క్లుప్తంగా

22న వేమన పద్యాల ప్రచార సభ

కాకినాడ కల్చరల్: స్థానిక గాంధీభవన్‌లో సాహిత్య, సాంస్కృతిక, కళారంగా ప్రోత్సాహ వేదిక ఆధ్వర్యంలో ఈనెల 22వ తేదీ ఆదివారం ఉదయం 10 గంటలకు వేమన పద్యాల ప్రచార సభ నిర్వహించనున్నట్టు వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు దాడి చంద్రశేఖర్ తెలిపారు. వేమన పద్యాల ప్రాముఖ్యాన్ని వివరించేందుకు ప్రచార సభ నిర్వహిస్తున్నామని దాడి తెలిపారు. దీనిలో బాగంగా విద్యార్థులకు వేమన పద్యాలధారణ పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. విజేతలైన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేస్తామని తెలిపారు. 13 నుంచి 25 సంవత్సరాల లోపు యువతీయువకులు పోటీల్లో పాల్గొనుటకు అర్హులని తెలిపారు. మరిన్ని వివరాలకు సెల్:8179786635ను సంప్రదించాలని కోరారు.

మీసాల వెంకన్నకు వెండిపాత్రల సమర్పణ



వెండి తలంబ్రాల పాత్రను అర్చకుడికి అందజేస్తున్న దాత సూర్యనారాయణరాజు

కరప: యండమూరులో వేంచేసిన మీసాల వెంకన్నబాబుకు వెండి తలంబ్రాల పాత్రను సమర్పించారు. సంక్రాంతిని పురస్కరించుకుని రాచపల్లి వాస్తవ్యులు కాకర్లపూడి సూర్యనారాయణరాజు, సీతాదేవి దంపతులు ఆలయంలోని సామ్రాజ్యలక్ష్మి, గోదాదేవి సమేత వేంకటేశ్వరస్వామివార్లను ఆదివారం దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. ఏటా గోదాదేవి కల్యాణం, భీష్మ ఏకాదశికి స్వామివారికి వార్షిక కల్యాణం నిర్వహిస్తారు. స్వామి వారి కళ్యాణ వేడుకల్లో తలంబ్రాలు బియ్యం వేసేందుకు వెండిపాత్రను సూర్యనారాయణరాజు దంపతులు ప్రధాన అర్చకులు పెద్దింటి సీతారామాచార్యులకు అందజేశారు.

నగరంలో ఘనంగా కనుమ పండుగ



బంగారు చీరలో బాలా త్రిపుర సుందరి అమ్మవారు

బోట్‌క్లబ్: కనుమ పండగను సోమవారం నగర ప్రజలు ఎంతో వైభవంగా జరుపుకొన్నారు. కొత్త దుస్తులు వేసుకొని దేవుడి దర్శనం కోసం నగరంలోని పలు ఆలయాలకు వెళ్లారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. కుటుంబ సభ్యులతో కలిసి , సినిమాలకు వెళ్లడంతో నగరంలోని పలు థియేటర్లు సందర్శకులతో కిటకిటలాడాయి. స్థానిక సూర్యారావుపేటలో ఉన్న బాలాత్రిపుర సుందరి సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారు బంగారం చీరలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక వెంకట్‌నగర్ వేంకటేశ్వర స్వామి ఆలయాన్ని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు, గాంధీనగర్, జగన్నాథపురంలో ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఘనంగా ముసలమ్మతల్లి జాతర

కాకినాడ రూరల్: ఇంద్రపాలెం గ్రామదేవత ముసలమ్మతల్లి జాతర మహోత్సవాలు సోమవారం ఘనంగా జరిగాయి. అమ్మవారి జాతరలో భాగంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

దాత ఆశయాలను నెరవేరుస్తున్నాం

బోట్‌క్లబ్: దాత ఆశయాలకు అనుగుణంగానే సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు కోకనాడ అన్నదాన సమాజం చైర్మన్ ముమ్మిడి శ్రీనివాసరావు అన్నారు. కోకనాడ అన్నదాన సమాజం వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా సోమవారం సినిమా రోడ్డులోని అన్నదాన సమాజంలో దాతల చిత్రపటాలకు పూలమాలలు వేసి వస్త్ర దానం చేశారు. కాకినాడ నగరంలో నిత్యం నిరుపేదలకు అన్నదానం చేయాలనే ఉద్దేశంతో దాతలు ఆర్‌వీకేఎం సూర్యారావు బహుదూర్, కోట లక్ష్మయ్య నాయుడు ఈ అన్నదాన సమాజాన్ని ప్రారంభించారన్నారు. అనంతరం బ్రాహ్మణులకు స్వయం పాకం, పేదలకు వస్త్రదానం చేశారు.

ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, నాయకులు రాగిరెడ్డి సుబ్బారావు, చోడిపల్లి ప్రసాద్, రాగిరెడ్డి అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

గ్రామాల్లో సంక్రాంతి సందడి

కాకినాడ రూరల్: తెలుగింట పెద్ద పండగ సంక్రాంతి పల్లెల్లో సందడి చేసింది. భోగి, సంక్రాంతి, కనుమ ఇలా మూడు రోజులపాటు ప్రతి ఇల్లు బంధువులతో కళకళలాడింది. సంప్రదాయబద్ధంగా నిర్వహించుకునే పండగల్లో భాగంగా సంక్రాంతి నాడు తమ పూర్వీకులకు దుస్తులు, పిండి వంటలు, భోజనాలు పెట్టి వారి ఆశీర్వచనాలు పొంది రోజంతా సరదగా గడిపారు. నూతన వస్త్రాలు ధరించి, పిల్ల పాపలతో దైనందినజీవితంలో ఉండే ఒత్తిళ్లను, కష్టసుఖాలను పక్కన పెట్టి ఆత్మీయ పలకరింపులతో సరదాగా పండగ చేసుకున్నారు. కనుమ నాడు అమ్మవార్లకు నైవేద్యాలుపెట్టి పండగను జరుపుకొన్నారు.

కోడిపందేలు కాకినాడ రూరల్ మండలంలో సందడిగా మారాయి. నియోజకవర్గ పరిధిలో కాకినాడ రూరల్, కరప మండలంతోపాటు గొడారిగుంట తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేశారు. వలసపాకల, తిమ్మాపురం, తూరంగి, పండూరు తదితర గ్రామాల్లో కోడిపందేలు జరిగాయి. కోడిపందేలకే పరిమితం కావాలని, గుండాటకు అనుమతి వ్వబోమని పోలీసులు పలు చోట్ల గుండాట బోర్డులను తీసుకుపోయారు. పలువురిపై కేసులు పెట్టారు. వాకలపూడి, సర్పవరం గ్రామంలో గుండాటలేని కారణంగా రెండో రోజే నిర్వాహకులు శిబిరాన్ని ఎత్తివేశారు. అలాగే కొవ్వాడ గ్రామంలోనూ ఇదే పరిస్థితి ఏర్పడింది. వలసపాకల గ్రామంలో జరిగిన కోడిపందేలను ఇతర ప్రాంతాల నుంచి జనం తిలకించేందుకు భారీగా వచ్చారు. సినీ తారల సందడితో వలసపాకలలో సందడి నెలకొంది.



వలసపాకలలో తలపడుతున్న పందెం కోళ్లు



పందేలను తిలకిస్తున్న సినీ, టీవీ ఆర్టిస్టులు, ప్రజలు



శిల్పారామంలో గాలిపటాలు ఎగురవేస్తున్న చిన్నారులు



శిల్పారామంలో బుర్రకథ కళాకారులు

ఆటల పోటీలు

కాకినాడ రూరల్: స్థానిక రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో సంక్రాంతి పండగను పురస్కరించుకొని ఆటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ముగ్గుల పోటీలు, మ్యూజికల్ చైర్ , పరుగు పందేలు, స్లో సైక్లింగ్ వంటి పోటీలు నిర్వహించారు. విజేతలకు అడబాల రత్న ప్రసాద్ బహుమతులు అందజేశారు.

గాలిపటాల పోటీల నిర్వహణ

కాకినాడ రూరల్: కాకినాడలో శిల్పారామంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని చిన్న పిల్లలకు గాలిపటాల పోటీలు నిర్వహించినట్టు శిల్పారామం , ఇన్‌చార్జి పరిపాలన అధికారి సి.మోహన్ తేజ తెలిపారు. అనంతరం సాంస్కృతిక కళావేదికపై శ్రీ భారతి బృందం చేసిన కూచిపూడి, భరతనాట్యం నృత్య ప్రదర్శన ప్రేక్షకులను ఆకట్టుకుంది. హరిదాసు, బుడబుక్కల వారు శిల్పారామంలో సందడి చేశారు. శిల్పారామంలో కనుమ పండగనాడు గంగిరెద్దుల విన్యాసాలు చిన్న పిల్లలను, పెద్దలను ఆకట్టుకున్నాయి. అనంతరం సాంస్కృతిక కళావేదికపై చిరంజీవి బృందం వారితో బుర్ర కథ కార్యక్రమం నిర్వహించారు.

అభ్యుదయ వేదిక ఆధ్వర్యంలో..

కాకినాడ సిటీ: తూరంగి అల్లూరి సీతారామరాజు కాలనీలో చింతపల్లి అప్పారావు అభ్యుదయ వేదిక ఆధ్వర్యంలో మూడు రోజులుగా నిర్వహించిన సంక్రాంతి సంబరాల్లో విజేతలకు సోమవారం సాయంత్రం వేదిక నిర్వాహకులు చింతపల్లి అజయ్‌కుమార్, విజయ బహుమతులు అందజేశారు. సంక్రాంతి సందర్భంగా ఈనెల 13, 14, 15 తేదీల్లో వివిధ రకాల ఆటలు, ముగ్గులు, పతంగుల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. సోమవారం తణుకు గ్రామానికి చెందిన గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు సాధించిన పేలూరి మహాలక్ష్మి కూచిపూడి, భరతనాట్యం, ఫోక్, వెస్ట్రన్ నాట్య కార్యక్రమాల నిర్వహణ చూపరులను ఆకట్టుకున్నాయి. అల్లూరి సీతారామరాజు కాలనీలో అంగరంగవైభవంగా సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ధన్వంతరి నాయీబ్రాహ్మణ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు సుందరపల్లి గోపాలకృష్ణ, కాకినాడ జిల్లా సేవా సంఘం అధ్యక్షుడు కింతాడ సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

కోడిపందేలపై దాడి



కరప మండలంలో నిర్వహిస్తున్న కోడిపందేలు

కరప: మండలంలోని పలు గ్రామాల్లో కోడి పందేలు, గుండాట శిబిరాలపై సోమవారం కరప పోలీసులు ఆకస్మిక దాడులు నిర్వహించి, ఏడు కేసులు నమోదు చేసి, 14మందిని అరెస్ట్ చేసినట్టు కరప ఎస్ఐ ఎస్.రామకృష్ణ తెలిపారు. విజయరాయుడుపాలెం, గురజనాపల్లి, గొర్రిపూడి గ్రామాల్లో కోడిపందేలు, గుండాటలు జరగకుండా పోలీసులు అడ్డుకున్నారు. పెనుగుదురు, కొంగోడు గ్రామాల్లో గుండాట శిబిరంపై దాడిచేశారు. ఆయా గ్రామాల్లో కోడిపందేలు గుండాట నిర్వహిస్తున్న శిబిరాలపై ఎస్ఐ రామకృష్ణ ఏఎస్ఐలు జి.ప్రసన్నకుమార్, కె.సూరిబాబు, సిబ్బందితో కలిసి దాడి చేసి మూడు కోడిపుంజులు, మూడు కోడికత్తులు, రూ 8,350 నగదు స్వాధీనం చేసుకున్నారు. 14 మంది నిందితులను అదుపులోకి తీసుకున్నామన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి, కాకినాడ కోర్టులో హాజరుపరుస్తామన్నారు.

పరీక్ష పే చర్చకు కరప విద్యార్థి



కరప: ఢిల్లీలో ప్రధాని నరేంద్రమోదీ నిర్వహించే పరీక్ష పే చర్చ-2023కు కరపలోని మహాత్మా జ్యోతిబా పూలే ఆంధ్రప్రదేశ్ వెనకబడిన తరగతుల గురుకుల పాఠశాలల పదో తరగతి విద్యార్థి తగరంపూడి ఇస్సాకు ఎంపికైనట్టు ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ కె.వెంకటరామకృష్ణ సోమవారం తెలిపారు. రాష్ట్రం నుంచి ఇద్దరు విద్యార్థులు ఎంపిక కాగా అందులో కరపలోని గురుకుల పాఠశాల విద్యార్థి ఇస్సాకు ఒకరు. ప్రధాని నరేంద్రమోదీ విద్యార్థులతో మమేకమై పరీక్షలపై విద్యార్థులకు ఉండే ఆలోచనా విధానం, ఒత్తిడిని నేరుగా అడిగి తెలుసుకునేందుకు ×పరీక్ష పే చర్చ÷ కార్యక్రమాన్ని చేపట్టారు. ఇందులో భాగంగా 9వ తరగతి నుంచి 12వ తరగతివరకు చదివే విద్యార్థులు తమ పేరును రిజిస్టర్ చేసుకుని, తమ సందేహాలకు సంబంధించిన ప్రశ్న ప్రధానిని అడిగేందుకు గత డిసెంబరులో ఈ అవకాశం కల్పించారు. రాష్ట్రం నుంచి ఇద్దరు విద్యార్థులను ఎంపిక చేయగా అందులో ఒకరు గురుకుల పాఠశాల విద్యార్థి ఇస్సాకు కావడం విశేషం. ఢిల్లీలో ఈనెల 24 నుంచి 28వ తేదీ వరకు జరిగే పరీక్ష పే చర్చా కార్యక్రమంలో విద్యార్థి ఇస్సాకు పాల్గొంటాడని ప్రిన్సిపాల్ వెంకటరామకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థి ఇస్సాక్‌కు ప్రిన్సిపాల్ వెంకటరామకృష్ణ, జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, ఎంఈఓ కె.బుల్లికృష్ణవేణి, ఉపాధ్యాయుడు పేపకాయల వీర్రాజు అభినందనలు తెలిపారు.

ఎమ్మెల్యే కన్నబాబును కలిసిన దర్శకుడు బాబి



వాల్తేరు వీరయ్య దర్శకుడు బాబికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు, దర్శకుడు కల్యాణ్‌కృష్ణ తదితరులు

కాకినాడ రూరల్: సంక్రాంతి బరిలో చిరంజీవి హీరోగా నటించిన 'వాల్తేరు వీరయ్య' చిత్ర దర్శకుడు బాబి కాకినాడ రూరల్‌లో సోమవారం సందడి చేశారు. ఎమ్మెల్యే కన్నబాబును మర్యాద పూర్వకంగా ఆయన నివాసంలో కలిశారు. ఆయనతో పాటు కురసాల సత్యనారాయణ, కల్యాణ్‌కృష్ణ తదితరులు ఉన్నారు.

గోమాత సర్వదేవతా స్వరూపం



కరప విష్ణాలయంలో గోమాతకు పూజలు చేస్తున్న దృశ్యం



బాలాత్రిపుర సుందరి సమేత రామలింగేశ్వర స్వామి ఆలయంలో గోపూజలో పాల్గొన్న భక్తులు

బోట్‌క్లబ్: కాకినాడ నగరంలోని పలు ఆలయాల్లో గోపూజ వైభవంగా నిర్వహించారు. కనుమ రోజున గోమాతను పూజిస్తే సకల సుఖాలు లభిస్తాయనే నమ్మకంతో ఆలయాల్లో గోపూజ నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయాల వద్ద సందడి నెలకొంది. గోమాత సర్వదేవతా స్వరూపమని కాకినాడ బాలా త్రిపుర సుందరి సమేత రామలింగేశ్వరస్వామి దేవస్థానం ఈఓ చింతపల్లి విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. గోపూజ కార్యక్రమంలో భాగంగా ఆలయంలో గోమాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక భానుగుడి అయ్యప్పస్వామి ఆలయంలో గోపూజ వైభవంగా నిర్వహించారు. ఆలయ పర్సన్ ఇన్‌చార్జ్ గోపాలకృష్ణ ఆధ్వర్యంలో పండితులు ఈ పూజలు నిర్వహించారు. దేవాలయంవీధిలోని భీమేశ్వరస్వామి ఆలయంలోపాటు పలు ఆలయాల్లో గోపూజ నిర్వహించారు.

పలు ఆలయాల్లో గోమాత పూజ

కరప: మండలంలోని పలు ఆలయాల్లో దేవదాయశాఖ ఆధ్వర్యంలో సోమవారం గోమాత పూజను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక విష్ణాలయంలో ప్రధాన అర్చకుడు పెద్దింటి అనంతాచార్యులు, గోపాలకృష్ణ గోమాతకు పూజలు నిర్వహించారు. ఈఓ వడ్డాది సత్తిబాబు, సీహెచ్ శ్రీను ఏర్పాట్లను పర్యవేక్షించారు. యండమూరులోని సామ్రాజ్యలక్ష్మి, గోదాదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో అర్చకులు పెద్దింటి సీతారామాచార్యులు భక్తులతో కలిసి గోమాతకు పూజలు చేశారు. అరట్లకట్ట, వేళంగి, పెనుగుదురు తదితర గ్రామాల్లో గోమాత పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని భక్తులు తరలివచ్చి గోమాతకు పూజలు చేసి, ప్రదక్షణలు చేసి, తీర్థప్రసాదాలు స్వీకరించారు.

35 ఏళ్ల తర్వాత కాకినాడ వచ్చా..

- సినీ దర్శకుడు రామ్‌గోపాల్‌వర్మ
- ద్వారంపూడితో ఆర్‌జీవీ భేటీ



ఎమ్మెల్యే ద్వారంపూడితో సినీ దర్శకుడు రామ్‌గోపాల్‌వర్మ

కాకినాడ: 35 ఏళ్ల తరువాత కాకినాడ వచ్చానని ప్రముఖ సినీ దర్శకుడు రామ్‌గోపాల్‌వర్మ అన్నారు. జిల్లాకు వచ్చిన ఆయన ఆదివారం కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి కొద్దిసేపు ముచ్చటించారు. అనంతరం తనను కలిసిన విలేకర్లతో ఆర్జీవీ మాట్లాడుతూ స్నేహితుల ఆహ్వానం మేరకు 35 ఏళ్ల తరువాత కాకినాడ వచ్చానన్నారు. అప్పట్లో తన అత్తయ్య ఇక్కడ ఉండడంతో వచ్చానని, మళ్లీ ఇదే రావడమన్నారు. ఇటీవల చిరంజీవి సోదరుడు, సినీనటుడు నాగబాబు చేసిన వ్యాఖ్యలు, విమర్శలను ప్రస్తావించగా తాను వినలేదని, చూసిన తరువాత స్పందిస్తానన్నారు. ఎమ్మెల్యే ద్వారంపూడిని మర్యాదపూర్వకంగానే కలిశానన్నారు.

గుండాట శిబిరాలపై దాడులు

కాకినాడ సిటీ: కాకినాడ రూరల్ మండలం కొవ్వూరు, తూరంగి గ్రామాల్లో నిర్వహించి కోడిపందేల శిబిరాలపై ఇంద్రపాలెం పోలీసులు దాడులు చేసి కేసులు నమోదు చేశారు. ఈ ప్రాంతాల్లో గుండాట, జూద శిబిరాలపై దాడులు చేసి వాటి నిర్వహణను అడ్డుకుని గుండాట బోర్డులు, టెంట్‌లను తొలగించారు. వాటి నిర్వాహకులపై కేసులు నమోదు చేశారు. అయితే కోడిపందేల బరులు మాత్రం యథావిధిగా జరిగాయి. ఇంద్రపాలెం ఎస్ఐ నాగరాజు పర్యవేక్షణలో సిబ్బంది ఈ దాడుల్లో పాల్గొన్నారు.

దేశ సేవ కోసం సైన్యంలో చేరాలి

కాకినాడ రూరల్: దేశ సేవలో తరించడం కోసం అర్హత గల యువత సైన్యంలో చేరాలని ఆర్మీ విశ్రాంతి ఉద్యోగి ఎస్.నగేష్ పేర్కొన్నారు. రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో 75వ జాతీయ సైనిక దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 200 ఏళ్ల నాటి బ్రిటిష్ పాలన తర్వాత 1949 జనవరి 15న తొలిసారిగా ఒక భారతీయుడికి సైనిక పగ్గాలు అప్పగించడంతో అప్పటి నుంచి జాతీయ సైనిక దినోత్సవంగా జరుపుకొంటున్నామన్నారు. ఆధ్యాత్మిక వేత్త రవిశంకర్ పట్నాయక్ మాట్లాడుతూ త్యాగానికి మరో రూపం సైనికుడన్నారు. దేశం కోసం సైనికులు సాధించిన విజయాలను, వారు చేసిన సేవ, సహకారం, త్యాగాలను ప్రతి ఒక్కరూ గౌరవించాలని తెలిపారు. ఈ సందర్భంగా అడబాల రత్న ప్రసాద్ ఆధ్వర్యంలో నగేష్‌ను ఘనంగా సత్కరించారు.

అధ్వానంగా విద్యుత్ నగర్ పార్కు

బోట్‌క్లబ్: ప్రజలకు ఆహ్లాదాన్ని పంచాల్సిన విద్యుత్‌నగర్ పార్కు నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. సందర్శకులు పార్కు లోపలికి వెళ్లాలంటేనే భయపడాల్సిన పరిస్థితి నెలకొంది. మూడు నెలల క్రితం పార్కును శుభ్రం చేయించిన అధికారులు తర్వాత దీని విషయం మర్చిపోయారు. దీంతో ప్రస్తుతం పార్కు చాలా అధ్వానంగా తయారైంది. పార్కులో ఉన్న చిన్న పిల్లల ఆట వస్తువులు కూడా తుప్పుపట్టిపోతున్నా ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు. పార్కును శుభ్రం చేసి, సదుపాయాలు కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.



పిచ్చిమొక్కలతో అధ్వానంగా ఉన్న విద్యుత్‌నగర్ పార్కు